# పోలీస్ గుర్రపుస్వారీ విజేత ఐటీబీపీ



గుర్రపు స్వారీలో ఉత్తమ హార్స్‌గా ఎంపికైన రూహి

- రెండోస్థానంలో అస్సాం రైఫిల్స్
- బెస్ట్ రైడర్‌గా జితేందర్, ఉత్తమ హార్స్ రూహి
- బెస్ట్ ఉమెన్ రైడర్ అవంతిలోధి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నేషనల్ పోలీస్ అకాడమీలో గత డిసెంబర్ 26 నుంచి శుక్రవారం వరకు జరిగిన 'ఆలిండియా 42వ పోలీస్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ అండ్ మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్'లో ఓవరాల్ చాంపియన్‌గా 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్' (ఐటీబీపీ) నిలిచింది. మొత్తం 120 పాయింట్లు సాధించి మొదటిస్థానాన్నికైవసం చేసుకొన్నది. 73 పాయింట్లతో అస్సాం రైఫిల్స్ రన్నరప్‌గా నిలిచింది. మౌంటెడ్ పోలీస్ డ్యూటీ విన్నర్‌గా హైదరాబాద్‌కు చెందిన జాతీయ పోలీస్ అకాడమీ నిలిచింది. ఈ పోటీల్లో బెస్ట్ హార్స్‌గా రాజస్థాన్‌కు చెందిన రూహి, ఉత్తమ రైడర్‌గా రాజస్థాన్‌కు చెందిన డీఎస్పీ జితేందర్‌సింగ్, బెస్ట్ ఉమెన్ రైడర్‌గా అస్సాం రైఫిల్స్‌కు చెందిన అవంతి లోధి ఎంపికయ్యారు.

### చాలా గర్వంగా ఉన్నది..

గుర్రపుస్వారీలో 14 మంది మహిళలు పాల్గొనడం చాలా ఆనందంగా ఉన్నది. నేను ఎన్నో విభాగాల్లో గట్టి పోటీ ఇచ్చా. షో జంపింగ్‌లో గోల్డ్ మెడల్, హ్యాక్స్‌లో రజతం, డ్రస్సేజ్ ప్రిలిమినరీలో 4వ స్థానంలో నిలిచా. మొత్తంగా ఉత్తమ మహిళా రైడర్‌గా ఎంపికవడం గర్వంగా ఉన్నది.

– అవంతి లోధి, ఉత్తమ మహిళా రైడర్, అస్సాం రైఫిల్స్



బెస్ట్ హార్స్ ఆఫ్ ది చాంపియన్‌షిప్ అవార్డు అందుకొంటున్న రైడర్ జితేందర్

## విద్యా - ఉద్యోగ సమాచారం

### నేడు, రేపు గీతం ఎంట్రెన్స్ ఎగ్జామ్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : గీతం (డీమ్డ్ టూ బీ వర్సిటీ)లో 2024 –25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే గీతం అడ్మిట్ టెస్ట్ (గ్యాట్) పరీక్ష శని, ఆదివారాల్లో జరుగనున్నది. శనివారం ఇంజినీరింగ్, ఆదివారం మిగతా విభాగాలకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ ఏడాది 50వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నట్టు వర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

### యూ సీడ్ అడ్మిట్‌కార్డుల విడుదల

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : ఐఐటీల్లోని డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఆఫ్ డిజైన్ (యూసీడ్) అడ్మిట్‌కార్డులు విడుదలయ్యాయి. ఐఐటీ బాంబే వీటిని uceed.iitb.ac.in. వెబ్‌సైట్‌లో రిలీజ్ చేసింది. విద్యార్థులు క్యాండిడేట్ లాగిన్‌లోకి వెళ్లి అడ్మిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 21న ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షను జాతీయంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### 8న అప్రెంటిషిప్ మేళా

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : ఐఐటీ, డిప్లొమా, డిగ్రీకోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు ఈ నెల 8న అప్రెంటీషిప్ మేళా నిర్వహించనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్తీలోని ఐటీఐ కాలేజీలో ఉదయం 10 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మేళా కొనసాగనున్నదని పేర్కొన్నారు. 18 ఏండ్లు పైబడి, విద్యార్హతలు ఉన్న వారంతా ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.

### ఉమ్మాపూర్‌లో రాతి మొద్దు కత్తి!



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ గ్రామ పరిధిలోని పాటిగడ్డ మీద కొత్తరాతి యుగం ఆనవాళ్లు లభించాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యుడు అహోబిలం కరుణాకర్ అక్కడ ఆనాటి రాతి మొద్దు కత్తిని గుర్తించారు. ఇది 10 అంగుళాల పొడవు, 7 అంగుళాల వెడల్పు ఉన్నది. వేటాడిన జంతువులను కోసుకొని తినడానికి, ముక్కలుగా నరకడానికి వాడిన పనిముట్లలో ఇది ఒకటని, పట్టుకోవడానికి పిడికిలి ఉన్న పదునైన అంచున్న రాతి కత్తి ఇదని కరుణాకర్ తెలిపారు. సమీపంలో పెద్దరాతియుగం సమాధులు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు.

# ఎన్వోసీ లేకుండానే వెరిఫికేషన్?

- 317 జీవో ప్రభావిత నర్సుల్లో 200 మంది వరకు హాజరు
- తమకు న్యాయం చేయాలని అభ్యర్థుల వేడుకోలు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో స్టాఫ్ నర్సుల భర్తీకి నిర్వహిస్తున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కొందరు అభ్యర్థులు 'ఎన్వోసీ' (నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్) తీసుకోకుండానే హాజరైనట్టు తెలుస్తున్నది. 317 జీవోతో ప్రభావితమైన స్టాఫ్ నర్సుల్లో సుమారు 200 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయినట్టు నర్సింగ్ యూనియన్లు ఆరోపిస్తున్నాయి. వారి వల్ల అర్హులైన ఇతర అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తుది జాబితా విడుదల చేసేలోగానే వారిని గుర్తించి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు (ఎంహెచ్ఎస్ఆర్బీ)కి విజ్ఞప్తి చేస్తున్నారు. 317 జీవో అమలు చేసినప్పుడు అనేక మంది పట్టణాల నుంచి పల్లెలకు, ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరపడిన కొందరు జిల్లాలకు బదిలీ అయ్యారు. వీరిలో సుమారు 600 మంది స్టాఫ్‌నర్సులు తమకు అన్యాయం జరిగిందంటూ గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తున్నదని, తిరిగి పాత స్థానాలకు పంపించాలని కోరారు. ఇది ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉన్నది. అయితే కొందరు అభ్యర్థులు తమకు నచ్చిన ప్రాంతంలో పోస్టు వస్తుందనే ఉద్దేశంతో ఇటీవల జరిగిన స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్‌లో పరీక్ష రాశారు. వారికి మెరిట్ మార్కులు రావడంతో ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారంరోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై, ప్రక్రియ పూర్తిచేసుకున్నారు. అయితే.. సర్వీస్‌లో ఉన్న నర్సులు మళ్లీ ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసే సమయంలో 'ఎన్వోసీ' సమర్పించాల్సి ఉంటుందని నర్సింగ్ యూనియన్లు చెప్తున్నాయి. పనిచేస్తున్న హాస్పిటల్‌లోని అధికారుల అనుమతితో డీఎంహెచ్‌వో, డీపీహెచ్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసి ఎన్వోసీ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కానీ సుమారు 200 మంది వరకు ఎన్వోసీలు ఇవ్వకుండానే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### అర్హులైన అభ్యర్థులకు అన్యాయం

సర్వీస్‌లో ఉన్న నర్సులు ఇలా చేయడం వల్ల అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్తున్నారు. సెలక్షన్ లిస్ట్ ప్రకటించిన తర్వాత వారికి ఎంప్లాయీ ఐడీలు ఇచ్చే క్రమంలో ఆధార్, ఇతర వివరాలు తీసుకున్నప్పుడు వారు అప్పటికే సర్వీస్‌లో ఉన్న విషయం తెలుస్తుందని అంటున్నారు. ఎన్వోసీ లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటారని, దీంతో ఆ పోస్టు భర్తీ కాకుండా ఖాళీగా మిగిలిపోతుందని చెప్తున్నారు. దీంతో అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. వెరిఫికేషన్ సమయంలోనే వారిని గుర్తించి జాబితా నుంచి తొలిగిస్తే న్యాయం చేసినవారవుతారని చెప్తున్నారు. ఎవరెవరు ఎన్వోసీలు ఇవ్వలేదు? ఏయే జిల్లాల్లో ఉన్నారు? అందుకు గల కారణాలు ఏమిటి? అనే అంశాలను పరిశీలించిన తర్వాత, వారిపై చర్యలు తీసుకున్న అనంతరమే ఎంపిక జాబితా విడుదల చేయాలని కోరుతున్నారు. 7,094 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి 1:1.25 పద్ధతిలో 9892 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచారు. కాబట్టి ఎన్‌వోసీ లేనివారిని పక్కనబెట్టినా మరోసారి వెరిఫికేషన్ నిర్వహించాల్సిన అవసరం రాకపోవచ్చని సూచిస్తున్నారు.

# యూపీ ప్రైవేటు వర్సిటీల్లోనే రిజర్వేషన్లు

- అన్ని రాష్ట్రాలపై ఉన్నత విద్యామండలి కసరత్తు
- ప్రైవేటు వర్సిటీల్లో రిజర్వేషన్లపై అధ్యయనం పూర్తి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ యూనివర్సిటీల్లో రిజర్వేషన్ల అమలుపై తెలంగాణ ఉన్నత విద్యామండలి చేస్తున్న అధ్యయనం పూర్తికావొచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో తప్ప మరెక్కడా ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్లు అమలుకావడం లేదని అధికారులు తేల్చారు. ఈ అంశంపై రూపొందించిన నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఇటీవలే ఉన్నత విద్యపై నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ల అంశంపై నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అనురాగ్, మల్లారెడ్డి, ఎస్సార్ యూనివర్సిటీలు 2020లో ఏర్పాటయ్యాయి. అంతకు ముందే ఇక్ఫాయ్, చైతన్య, గీతం, మహీంద్రా, వోక్సేన్ వంటి వర్సిటీలున్నాయి. వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం చేసింది. కనీసంగా 25 శాతం సీట్లను స్థానికులకు కేటాయించాలని నిబంధన పెట్టింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు మన తరహాలోనే వర్సిటీల ఏర్పాటుకు చట్టాలు చేశాయి. అయితే ఒక్క యూపీలో 2019లో చేసిన చట్టంలో ప్రైవేట్ వర్సిటీల్లో సీట్ల భర్తీలో రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, జనరల్ క్యాటగిరీ రిజర్వేషన్ల సీట్ల భర్తీ సహా నియామకాలకు అమలు చేయవచ్చని స్పష్టం చేశారు. అయితే రిజర్వేషన్ కోటా ఎంతన్నది మాత్రం పేర్కొనలేదు. ఇదే విషయాన్ని రాష్ట్రప్రభుత్వం ముందుంచాలని ఉన్నత విద్యామండలి అధికారులు నిర్ణయానికి వచ్చారు.

### దేశంలో 397 ప్రైవేట్ వర్సిటీలు

యూజీసీ అధికారిక సమాచారం ప్రకారం దేశంలో 397 ప్రైవేట్ వర్సిటీలున్నాయి. వీటిలో అత్యధికంగా బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో 245 యూనివర్సిటీలు ఉన్నాయి. మొత్తం ప్రైవేట్ యూనివర్సిటీల్లో 2014 తర్వాత 210 ఏర్పాటయ్యాయి. వీటిల్లో రిజర్వేషన్ల అమలు అంశంపై నిర్ణయం రాష్ట్రాలకే వదిలేశారు. తాజాగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి అందజేసే నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. ఇందుకు పాత చట్టాన్ని సవరించాల్సి ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అనురాగ్ విద్యాసంస్థల సీఈవో నీలిమ స్పందిస్తూ రిజర్వేషన్ల అమలుతో తమకేం నష్టంలేదని, ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి వాటి ప్రకారం నడుచుకుంటామని తెలిపారు.

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ల పదవులు రద్దు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని జిల్లా, నగర గ్రంథాలయ సంస్థల చైర్మన్లు నాన్ ఆఫీషియల్ మెంబర్ల పదవులను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శుక్రవారం జీవో జారీచేశారు. రాష్ట్రంలో 33 జిల్లాలకు జిల్లా గ్రంథాలయ సంస్థలున్నాయి. వీటికి నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లతో పాటు, సభ్యులను గత ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం రావడంతో వీరి పదవులు రద్దు చేస్తూ, ఉత్తర్వులిచ్చారు.

## గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, జనవరి5 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్టు వీటీజీ సెట్ కన్వీనర్ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని స్పష్టంచేశారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి, మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 45678, www.tgcet.cgg.gov.in, http://www.tgcet.cgg.gov.inను సంప్రదించాలని సూచించారు.

